క్లుప్తంగా

మానవత ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీలో పాల్గొన్న మానవత సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: విద్యార్థులు విద్యార్థి దశ నుంచి చదువుతోపాటు సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలని మాజీ ఎంపీ చేగొండి హరి రామ జోగయ్య అన్నారు. శనివారం ప్రపంచ శాంతి కోరుతూ మానవత సేవా సంస్థ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మాజీ ఎంపీ జోగయ్య జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగయ్య మాట్లాడుతూ శాంతి కోసం మానవతా స్వచ్ఛంద సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నుంచి యడ్లబజారు సెంటర్ వరకూ విద్యార్థులు, వివిధ సేవా సంస్థల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ పట్టణ అధ్యక్షులు ముత్యాల శ్రీనివాస్, ఛైర్మన్ కేవీ కృష్ణవర్మ, పీఎస్ ప్రతాప్‌రాజు, మద్దాల వాసు తదితరులు పాల్గొన్నారు.

ముంపునకు గురైన నారుమడుల గుర్తింపు


ముంపునకు గురైన నారుమడులను పరిశీలిస్తున్న చిందులూరి దేవి

యలమంచిలి: ఇటీవల కురిసిన అధిక వర్షాలకు, గోదావరి వరదలకు మండలంలోని ఏడు గ్రామాలలో 19.51 ఎకరాలలో నారుమడి ముంపునకు గురై దెబ్బతిన్నట్లు గుర్తించామని మండల వ్యవసాయాధికారి చిందులూరి దేవి చెప్పారు. యలమంచిలి, ఆర్యపేట, చించినాడ, కాజ తూర్పు, కాజ పడమర, కలగంపూడి, ఏనుగువానిలంక గ్రామాలలో నారుమడులు దెబ్బతిన్నాయన్నారు. 19.51 ఎకరాలకు గానూ 254 మంది రైతులకు 78 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేసినట్లు ఆమె చెప్పారు. వీరికి 80 శాతం సబ్సిడీపై విత్తనాలు అందజేస్తామని ఆమె వివరించారు.

అధికారుల పనితీరుకు అవార్డులు కొలమానం


బూరుగుపల్లిలో గ్రామ కార్యదర్శి భవానీని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

యలమంచిలి: అధికారులకు పనితీరుకు ప్రజల మన్ననలతోపాటు ప్రభుత్వం ఇచ్చే అవార్డులు కూడా కొలమానంగా నిలుస్తాయని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు బోనం బులి వెంకన్న అన్నారు. బూరుగుపల్లి గ్రామ కార్యదర్శి భవానీకి ఉత్తమ కార్యదర్శి అవార్డు వచ్చిన సందర్భంగా శనివారం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు ఆమెకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంటపాటి నూకరాజు నాయకులు మామిడిశెట్టి చినబాబు, గుబ్బల రవితేజ వీఆర్వో ఎ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తూనికలు కొలతల శాఖ అధికారుల తనిఖీలు


పాలకొల్లులోని ఓ షాపులో కాటాలు తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాంబాబు

పాలకొల్లు సెంట్రల్: వ్యాపారస్తులు సకాలంలో తమ కాటాలకు సీళ్లు వేయించుకోవాలని తూనికలు కొలతలు శాఖ భీమవరం డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు అన్నారు. శనివారం పట్టణంలో వ్యాపారస్తుల వద్ద కాటాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ మాన్యువల్ కాటాలు ప్రతీ రెండేళ్లకు ఒకసారి, ఎలక్ట్రానిక్ కాటాలకు ప్రతీ సంవత్సరం సీళ్లు వేయించుకోవాలన్నారు. సీళ్ల లేకుండా వ్యాపారస్తులు తూకాలు వేయరాదని అలా వేయడం కూడా చట్టరీత్యా నేరమని గుర్తుంచుకోవాలని సూచించారు.

యోగాపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ×సామాజిక జీవనంలో యోగా ఆవశ్యకత్లపై బెంగళూరులోని యోగా విశ్వవిద్యాలయానికి చెందిన డాక్టర్ కుంభంపాటి సుబ్రహ్మణ్యం అవగాహన కల్పించారు. యోగాను వైజ్ఞానికంగా ఎలా ఉపయోగించుకుని జీవన ప్రయాణాన్ని కొనసాగించాలో విశదీకరించారు. వివేకానందుడు భారత వైభవాన్ని విశ్వ వ్యాప్తం చేసిన విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కొండేటి వెంకట రాజు, దాయన చంద్రాజీ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఉప ఎన్నికలు

మెజార్టీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల హవా


చింతపర్రు ఆరో వార్డు సభ్యురాలిగా ఎన్నికైన అంగర రామలక్ష్మికి ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎన్నికల అధికారి కె రాజశేఖర్


మార్టేరులో ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని అందుకుంటున్న 14వ వార్డు సభ్యురాలు కప్పల అనంతలక్ష్మి

పాలకొల్లు అర్బన్: మండలంలోని చింతపర్రు, గోరింటాడ వార్డు సభ్యులకు శనివారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. చింతపర్రులో మొత్తం 246ఓట్లకు గాను 202 ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీ బలపరచిన అంగర రామలక్ష్మి 105 ఓట్లు సాధించి విజయం సాధించింది. టీడీపీ బలపరచిన గూడవల్లి వెంకటరమణకు 95 ఓట్లు లభించాయి. ఒక ఓటు చెల్లలేదు, మరొక ఓటు నోటాకి వేశారు. అలాగే గోరింటాడ 6వ వార్డులో మొత్తం 98 ఓట్లు ఉన్నాయి. 74ఓట్లు పోలయ్యాయి. వైఎస్సార్ సీపీకి చెందిన పీతల యామిని దుర్గా చంద్రకళ 44 ఓట్లు సాధించి విజయం సాధించింది. సమీప అభ్యర్థి చవ్వాకుల మణి ప్రియాంకకు 29 ఓట్లు లభించాయి. ఒక ఓటు చెల్లలేదు. అలాగే అగర్తిపాలెం సర్పంచ్‌గా స్వతంత్ర అభ్యర్థి కావలి లక్ష్మీకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. దగ్గులూరు 12వ వార్డు సభ్యుడిగా వైఎస్సార్ సీపీకి చెందిన విశ్వనాథం పేరయ్య, వెలివెల 10వ వార్డు సభ్యుడిగా స్వతంత్ర అభ్యర్థి కొప్పినీడి కృష్ణవేణి, దిగమర్రు 7వ వార్డు సభ్యునిగా స్వతంత్ర అభ్యర్థి మన్నె మోహన్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చింతపర్రులో విజయం సాధించిన రామలక్ష్మిని సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు, ఉపసర్పంచ్ పెన్మెత్స రామకృష్ణంరాజు, పార్టీ నాయకులు చల్లా సాంబయ్య, రెడ్డిమాను నాగేంద్ర, గోరింటాడలో విజయం సాధించిన యామిని దుర్గా చంద్రకళను చవ్వాకుల జాన్, పార్శి జానీ, శిరిమామిళ్ల రోహిణీరావు, మండెల త్రిమూర్తులు, శిరిమామిళ్ల మన్మధరావు, చొప్పల నాగేశ్వరరావు తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

మార్టేరులో..

పెనుమంట్ర: మార్టేరు 14వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికలో వైఎస్సార్ సీపీకి చెందిన కప్పల అనంత లక్ష్మి ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి జాలెం సుచంద్రికపై 138 ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి యు.నాగేశ్వరరావు తెలియజేస్తూ ధ్రువీకరణ పత్రాన్ని అనంతలక్ష్మికి అందజేశారు. 497 ఓట్లు ఉన్న ఈ వార్డులో 356 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోగా పోటీలో ఉన్న అనంతలక్ష్మికి 246 ఓట్లు, సుచంద్రికకు 108 ఓట్లు, కారెం వరలక్ష్మికి 2 ఓట్లు లభించాయి. ఇక్కడ 72 శాతం ఓట్లు పోలైనట్లు ఆయన తెలియజేసారు. నరసాపురం డీఎస్పీ కార్యాలయ సీసీ జీవీ పైడేశ్వరరావు, నర్సాపురం టౌన్ సీఐ శ్రీనివాస యాదవ్, పర్యవేక్షణలో పెనుమంట్ర ఎస్సై బి.సురేంద్రకుమార్ తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ ఎప్పటికప్పుడు ఎన్నికల ప్రక్రియను పరిశీలించి ఎన్నికలు సజావుగా జరిగే విధంగా తమ సిబ్బందిని సమన్వయపర్చారు. మార్టేరులోని 14వ వార్డు ఓటర్లు వృద్ధులు, వికలాంగులు అధిక శాతం పోలింగ్ బూత్‌కు వచ్చి ఎంతో ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

దొంగరావిపాలెంలో..

పెనుగొండ: మండలంలోని దొంగరావి పాలెం పంచాయతీ 7వ వార్డుకు జరిగిన ఉప ఎన్నికల్లో కుడిపూడి వర ప్రసాద్ విజయం సాధించారు. శనివారం జరిగిన ఎన్నికలో 176 ఓట్లు పోలవగా, 111 ఓట్లు కుడిపూడి వర ప్రసాద్‌కు, 62 ఓట్లు పితాని సురేష్‌కు పోలయ్యాయి. 43 ఓట్లు తేడాతో విజయం సాధించారు.

విద్యార్థిని వైద్య ఖర్చులకు తోటి విద్యార్థుల సాయం


హేమజ్యోతి తండ్రికి ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన వైఎన్ కళాశాల ఇంటర్మీడియట్ విద్యార్థిని దేవరపు హేమజ్యోతి కుటుంబాన్ని సహచర విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆదుకుని ఔదార్యాన్ని చాటుకున్నారు. నాలుగు రోజుల క్రితం కళాశాల నుంచి తన చెల్లెలని బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి తిరిగి వెళుతుండగా ఎదురుగా వచ్చిన వాహనం ఢీకొట్టిన సంఘటనలో అన్నయ్య తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ఈ ప్రమాదంలో చెల్లెలు హేమజ్యోతి తీవ్ర గాయాలు కావడంతో రెండుకాళ్లు విరిగిపోయాయి. ఓ పక్క ఇంజినీరింగ్‌లో జాయిన్ కావాల్సిన కొడుకు మృతి, మరో పక్క విగత జీవిగా పడిఉన్న కూతురిని బతికించుకునేందుకు పది లక్షల పైనే వైద్య ఖర్చులు అవుతాయని చెప్పడంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. ఇలాంటి సమయంలో హేమజ్యోతి కుటుంబ ఆర్థిక పరిస్థితిని చూసిన కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం అంతా విరాళాలు సేకరించారు. ఆ వచ్చిన మొత్తం రూ.10,06,000లను శనివారం రుస్తుంబాద గ్రామంలోని గాదివారితోట వెళ్లి హేమజ్యోతి తండ్రి దేవరపు సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, ప్రెసిడెంట్ పొన్నపల్లి శ్రీరామారావు, కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘురామారావు తదితరులు మాట్లాడుతూ విద్యార్థిని హేమజ్యోతి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సహచర విద్యార్థినిని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కనకారావు, డీన్ డాక్టర్ గంధం శ్రీరామకృష్ణ, రాజేంద్ర ప్రసాద్, తోట ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలి


పేరుపాలెంలో ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల పరిషత్ ప్రత్యేకాధికారి విజయలక్ష్మి

మొగల్తూరు: జగనన్న కాలనీలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ ప్రత్యేకాధికారి వి విజయలక్ష్మి ఆదేశించారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా మండలంలోని పేరుపాలెం సౌత్ అంబేడ్కర్ కాలనీలో మంజూరైన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ కాలనీలో 48 ఇళ్లు మంజూరు చేయగా 26 వివిధ దశల్లో ఉన్నాయని, 9 మంది ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని, మరో 10 మంది ఇంటి నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని హౌసింగ్ ఏఈ ఫణీంద్ర ఆమెకు వివరించారు. దీనిపై స్పందించిన ఆమె ఇళ్ల పట్టాలు అందించి ఇల్లు మంజూరు చేసినా ఇంటి నిర్మాణాలు చేపట్టకపోతే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం అదే గ్రామంలో నాడు–నేడులో చేపట్టిన పాఠశాలల అభివృద్ధి పనులను, అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంపీడీఓ వి.బాబ్జిరాజు ఉన్నారు.

కేదారీ ఘాట్ ప్రక్షాళన


సిద్ధాంతంలో కేదారీఘాట్ ప్రక్షాళన పనులు

పెనుగొండ: సిద్ధాంతం కేదారీ ఘాట్ ప్రక్షాళన పనులుకు శ్రీకారం చుట్టారు. కేదారీఘాట్ శ్మశాన వాటికకు పరిసర ప్రాంతాల్లో పవిత్రమైన దక్షిణ కాశీగా పేర్గాంచడంతో ఆచంట నియోజకవర్గం, పాలకొల్లు, అత్తిలి , తణుకు, పెరవలి మండలాల నుంచి అంత్యక్రియలకు నిత్యం వస్తుంటారు. ఈ నేపథ్యంలో కేదారీ ఘాట్ పూర్తిగా అపరిశుభ్రంగా ఉండడంతో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు కేదారీఘాట్‌ను పరిశీలించి ప్రక్షాళన పనులు చేపట్టాలని దేవదాయ శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పవిత్ర ప్రాంతాన్ని అపరిశుభ్రంగా మార్చేస్తుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో దేవదాయ శాఖాధికారులు ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. పుష్కర ఘట్టాల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించడంతో పాటు, గోదావరి తీరంలో వదిలేస్తున్న పగిలిన దేవతామూర్తుల విగ్రహాలను వేరే ప్రాంతానికి తరలించడానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలోని చెత్తాచెదారాలను వేరే ప్రాంతంలో వేసుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

విద్యార్థికి పరామర్శ


వల్లూరు పాఠశాలలో వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టరు వేణుమాధవ్

పెనుగొండ: ఆచంట మండలం వల్లూరులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు మూడవ తరగతి విద్యార్థిని చితకబాదిన సంఘటనకు స్పందించిన రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టరు కొవ్వూరి వేణుమాధవ రెడ్డి శనివారం పరిశీలించారు. విద్యార్థిని తల్లిదండ్రులను పరామర్శించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని ధైర్యం చెప్పారు. విద్యార్థిని తిరిగి పాఠశాలకు పంపాలని కోరారు. ఉపాధ్యాయుడిని ఇప్పటికే జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారని వివరించారు. సంఘటనపై సమగ్ర విచారణ జరపాలని జిల్లా కలెక్టర్‌ను తాము ఇప్పటికే కోరామని తెలిపారు. విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహ సంబంధాలతో మెలగాలని, ఎలాంటి కఠిన శిక్షలకు పాల్పడవద్దని కోరారు. ఎవరైనా ఇలాంటి చర్యలు పాల్పడితే వారిపై చర్యలకు అధికారులకు సూచిస్తామని పేర్కొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా పరిశీలన


కొత్తకాయలతిప్పలో బీఎల్‌ఓలను వివరాలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ అనితా కుమారి

మొగల్తూరు: మండలంలో ఓటర్ల జాబితా ఇంటింటా సర్వే చురుగ్గా సాగుతుంది. శనివారం తహసీల్దార్ జి.అనితాకుమారి మొగల్తూరు పంచాయతీ కొత్తకాయలతిప్ప, మోడి గ్రామాల్లో ఇంటింటా ఓటర్ల జాబితా సర్వేను పరిశీలించి బీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. సర్వే పూర్తి చేయడానికి మరో రెండు రోజులు గడువు మాత్రమే ఉందని బీఎల్‌ఓ తమ పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో సర్వే పూర్తి చేయాలన్నారు. ఫారం6,7,8లపై ప్రత్యేక దృష్టి సారించాలని, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు, పేర్లు మార్పులో ఎక్కడా ఎలాంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ప్రతి బూత్‌స్థాయి అధికారి ప్రత్యేక రికార్డును నిర్వహించాలని కోరారు.

ఉప ఎన్నికల స్ఫూర్తితో ముందుకు


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధ

పెనుమంట్ర: మార్టేరు 14వ వార్డు ఉప ఎన్నికను స్ఫూర్తిగా తీసుకుని రాబోవు శాసన సభ ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి మార్టేరులో గత ఎన్నికల కంటే రెట్టింపు మెజార్టీని తీసుకువస్తామని గ్రామ–2 ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధ అన్నారు. ఎన్నికల అనంతరం విజయం సాధించిన కప్పల అనంతలక్ష్మితో కలిసి మార్టేరు వేణుగోపాల ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆచంట శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహాయ సహకారాలతో మార్టేరు గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించి తిరిగి ఆచంట నియోజకవర్గంలో ఆయనే ఎమ్మెల్యేగా గెలిపించే విధంగా కృషి చేస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో మార్టేరు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటి అధ్యక్షుడు చిర్ల సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్‌సీపీ సమన్వయ కమిటి సభ్యులు, సొసైటీ మాజీ అధ్యక్షులు వెలగల నారాయణ రెడ్డి, కొవ్వూరి బ్రహ్మేశ్వరరెడ్డి, జిల్లా కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ సత్తి విష్ణుకుమార్ రెడ్డి, వైఎస్సార్ సీపీ యువజన నాయకులు సత్తి సుబ్బారెడ్డి, గుత్తుల బోస్, సత్తి సనత్‌కుమార్‌రెడ్డి, చిర్ల సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

నరసాపురం రూరల్: కామ్రేడ్ పడాల శ్యామ సుందరరావు దార్శనికుడని, శాసన సభ్యుడిగా ఆయన ఆనాడే నరసాపురం ప్రాంత అభివృద్ధికి చట్టసభల్లో గళం వినిపించారని పలువురు వక్తలు అన్నారు. నరసాపురం శ్రీ వైఎన్ కళాశాల పిజి సెమినార్ హాల్లో శనివారం నరసాపురం తొలి శాసన సభ్యుడు, కమ్యూనిస్టు పార్టీ నేత పడాల శ్యామసుందరరావు జీవితచరిత్ర 'చరిత్ర మరిచిన చిత్తరువు' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సీపీఐ జిల్లా నాయకులు నెక్కంటి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్ పుస్తక సమీక్ష చేశారు. శ్యామసుందరరావు పెద్ద కుమార్తె డాక్టర్ సమతా రోష్ని, చరిత్ర పరిశోధకుడు గుర్రం సీతారాములు, యర్రంశెట్టి దుర్గా శ్రీనివాస్‌లు రచించిన ఈ పుస్తకాన్ని దారిదీపం ఎడిటర్ డీవీవీఎస్ వర్మ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్యామ సుందరరావు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.భీమారావు, వైఎన్ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, నెక్కంటి సుబ్బారావు, అడ్వకేట్ కామన బాల సత్యనారాయణ (బుజ్జి), రిటైర్డ్ ప్రొఫెసర్ మనోరమ, రచయిత్రి కరుణతాయమ్మ, మహిళా నాయకులు ప్రేంపావని, నెక్కంటి జగదాంబ, సీపీఐ నేత నెక్కంటి క్రాంతి కుమార్ పాల్గొని శ్యామసుందరరావు ఆత్మ కథపై ప్రసంగించారు. ఆయన చిన్న కుమార్తె మమతా నళిని వందన సమర్పణ నిర్వహించారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం


బ్రాహ్మణచెర్వు రాజన్నకాలనీ వద్ద ప్రారంభమైన కల్వర్టు నిర్మాణ పనులు.

పెనుమంట్ర: స్థానిక గ్రామపంచాయితీ పరిధిలోని బ్రాహ్మణచెర్వు గ్రామ రాజన్న కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులలో భాగంగా రాజన్న కాలనీ రోడ్డు రూ. 50 వేల అంచనాతో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులు శనివారం ప్రారంభించినట్లు సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక తెలిపారు. రాజన్నకాలనీలో గృహ నిర్మాణంతోపాటు రోడ్లను స్థానిక శాసన సభ్యులు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో వేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా పెనుమంట్ర–మార్టేరు ఆర్‌అండ్‌బీరోడ్డు నుంచి బ్రాహ్మణచెర్వు–వెలగలవారి పాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డుకు లింక్‌రోడ్డుకు కల్వర్టు లేకపోవడంతో ఆ కాలనీకి వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చిన్న కాలువ తూరలతో కల్వర్టు ఏర్పాటు చేసి రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): మద్యం, మాదక ద్రవ్యాల వైపు కౌమార దశలో ఉన్న విద్యార్థులు ఆకర్షితులు కావద్దని దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సైకాలజిస్ట్ టి.గంగాధర్ సూచించారు. పట్టణంలో శనివారం సొసైటీ ఆధ్వర్యంలో సుబ్బారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా అవగాహన సదస్సు నిర్వహించారు. గంగాధర్ మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రిత్వ శాఖ సహకారంతో సీపీఎల్ఐ ప్రాజెక్టు ద్వారా విద్యార్థుల కోసం ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ఓటర్ల జాబితా పరిశీలనను వేగవంతం చేయండి

ఉండి: ఓటర్ల జాబితా పరిశీలనను వేగవంతం చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి జీవీకే మల్లికార్జునరావు అధికారులను ఆదేశించారు. శనివారం ఉండిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సూపర్‌వైజర్లతో ఓటర్ల జాబితా పరిశీలనపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సుమారు 86 శాతం ఓటర్ల జాబితా ఇంటింటి సర్వే పూర్తయ్యిందని తెలిపారు. ఈనెల 21 నాటికి నూరుశాతం పూర్తి చేయాలని, పూర్తి చేయని వారిపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. బీఎల్‌వోల డైరీని తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఓటర్ల సర్వేలో అధికారులు ఎటువంటి ఒత్తిళ్ళకు లొంగకూడదన్నారు. సమావేశానికి తహసీల్దార్లు ఎస్.విజయలక్ష్మి, ఏఎస్ వీరాస్వామి నాయుడు, ఎ.కృష్ణారావు, ఎస్‌కే హుస్సేన్, ఎంపీడీవోలు జి.స్వాతి, కె.వాణి, ఏవీ అప్పారావు, ఎంఎన్ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

సాక్షి, భీమవరం: భీమవరం మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో సెప్టెంబర్ 9వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జడ్జి జి.సురేష్‌బాబు కోరారు. శనివారం కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో కేసులు వాదోపవాదాల అనంతరం ఒకరే గెలిచే అవకాశం ఉంటుందని, లోక్ అదాలత్‌లో కేసులను రాజీ చేసుకుంటే ఇరువురు గెలుస్తారన్నారు. కక్షిదారులు రాజీ మార్గాన్ని ఎంచుకుంటే సమయం, డబ్బు వృధా కాకుండా ఉంటాయని సురేష్‌బాబు వివరించారు. రాజీయే రాజ మార్గమని, రాజీ చేసుకోదగిన క్రిమినల్, చెక్ బౌన్స్, సివిల్ తగదాలు, వాహన ప్రమాదం వంటి కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సమావేశంలో భీమవరం రూరల్ సీఐ నాగప్రసాద్ పాల్గొన్నారు.

వేములదీవి వెంకన్నకు ప్రత్యేక పూజలు



నరసాపురం రూరల్: మండలంలోని కాపులకొడప ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. శ్రావణమాసం తొలి శనివారం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని స్వామి వారి సేవలో పాల్గొన్నారు. ఆలయ పూజారి పెద్దింటి అరుణ్‌కుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

మార్టేరులో..

పెనుమంట్ర: శ్రావణమాసం నేపథ్యంలో శనివారం మార్టేరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి వారిని అమ్మవార్లను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ కమిటి అధ్యక్షులు చిన్నారెడ్డి పర్యవేక్షించారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


ఫొటో స్టూడియో అధినేత కావలి నగేష్‌ను సత్కరిస్తున్న రోటరీక్లబ్ కార్యవర్గం

పాలకొల్లు అర్బన్: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు అధ్యక్షుడు పెనుమాక రామమోహన్‌రావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక రామా స్టూడియోలో కార్యక్రమం నిర్వహించారు. ఫొటోగ్రఫీలో మెళకువలు నేర్పి ఎంతో మంది యువతకు ఉపాధి కల్పించిన రామా స్టూడియో వ్యవస్థాపకుడు దివంగత కావలి తాతయ్యకి నివాళులర్పించారు. కావలి నగేష్‌ను రోటరీ ఆధ్వర్యంలో సత్కరించారు. క్లబ్ కార్యదర్శి రావాడ సతీష్, కోశాధికారి ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, ముత్యాల శ్రీనివాస్, చందక రాము, పీర్ సాహెబ్, మద్దాల వాసు, జక్కంపూడి కుమార్, కానూరి ప్రభాకర్, ఎస్ఎస్ మూర్తి, కొనిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలులో జైల్ అదాలత్


నరసాపురం సబ్‌జైలులో జైల్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు

నరసాపురం రూరల్: న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని ముద్దాయిలకు మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని నరసాపురం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక సబ్‌జైలులో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్ ఆదేశాల మేరకు జైల్ అదాలత్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాస్ ముద్దాయిలతో నేరుగా మాట్లాడి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ముద్దాయిలకు అందుతున్న భోజన, వసతి సౌకర్యాలను గురించి జైల్ సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసున్నారు. స్వయంగా భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో జడ్జితో పాటు ఉచిత న్యాయవాది కె.శిరీష, పారాలీగల్ వలంటీర్ డి.వరలక్ష్మి, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు తదితరులు ఉన్నారు.

సీపీఐ బస్సు యాత్ర కరపత్రాల పంపిణీ

సాక్షి, భీమవరం: రాష్ట్రాన్ని రక్షించండి, దేశాన్ని కాపాడండి అంటూ సీపీఐ చేపట్టిన బస్సు యాత్రను విజయవంతం చేయాలని భీమవరంలో శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ సమితి కార్యదర్శి చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన తణుకు నిర్వహించే బస్సు యాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో బంగారు శివ, దుర్గారావు, సత్యనారాయణ, నీలపు శ్రీను, కిల్లరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.